# పుట్టుమచ్చ

సుందరమ్మ పక్కమీదే బద్ధకంగా వొత్తిగిల్లి తన చేయికి అందుబాటులో వున్న పెద్దకిటికీయొక్క అడుగు తలుపుని తీసి, పెరట్లోకి చూసింది ఉదయారుణుని లేతకాంతులు కరివేపాకు చెట్టుయొక్క లేచిగుళ్ళని మృదువుగా తాకుతున్నాయి. ఆ చెట్టు మొదట్లో మోకాళ్ళమీద కూచుని చెట్టుచుట్టూ చిన్న గునపంతో బోదె తవ్వుతూ, రెండు చేతులతో మట్టి పెళ్ళగించుతూ తదేక ధ్యానంతో పనిచేయుచున్న పదేళ్ళ కుర్రవాడిమీదకు ఆమెచూపు మళ్ళింది. సుందరమ్మ పచ్చని పసిమికల ముఖము అపిల్లవానిమీది కోపముతో ముద్ద మందారపు పూవు రంగుగా మారింది. దిగ్గుమని లేచి మంచం నడుంగా కూర్చుని-

'అరే బాలూ! లేవగానే మట్టితో ఏమిపనిరా! హోమువర్కు చేసుకున్నావా? మిల్కు తీసుకున్నావా?' అని గట్టిగా కేకవేసింది. తెల్లగా, బొద్దుగా, గుండ్రంగా, వీపుమీద చిన్న బనీను అన్నా లేకుండా, చిన్న పొట్టి నిక్కరుతో వున్న ఆ కుర్రవాడు మట్టిచేతులు దులుపుకొని నిక్కరుకు తుడుచుకొని లేచి నించుని కిటికీవేపు ఒకసారి చూసాడు.

‘ఇంకా అల్లా నిలబడతావేం రాస్కెల్ ! ఇటురా !’ అన్నది సుందరమ్మ. ఆ పిల్లవాడు విస్ఫారిత నయనాలతో సుందరమ్మవేపు అయోమయంగా చూశాడు. చెంపకు చారెడేసిగా వున్న ఆ పిల్లడి నీలి నయనాల కిందుగా కుడిచెంప మీదుగా, శనగబద్దంత పుట్టిమచ్చ స్పష్టంగా సుందరమ్మ చూడగల్గింది. వాడు రమ్మనగానే తనవద్దకు రాకుండగా దూరంగా నించోని మురిపించటం సుందరమ్మకి ఆత్మానందాన్నే కలుగజేసింది. కాని అది ఆమె పైకి వ్యక్తపరచకుండగా–

‘ఏమిరా ! అల్లా నిలచుండిపోయేవ్ ? ఇట్లా కిటికీదగ్గరగా రా ! నాన్నారు వూళ్ళో లేకపోతే నువ్వు నన్ను మరీ నిర్లక్ష్యం చేస్తావు ? ప్రొద్దుటే అల్లా మట్టిగోపడి పొర్లాడక పోతే బుద్ధిగా చదువుకోకూడదూ ! అయినా మీతాత నేలదున్నుక బ్రతికేవాడయితే, నీకు దర్జా చదువు రమ్మంటే ఎల్లా వస్తుందీ ! తాత బొచ్చె తరాలవరకూ, అన్నశాస్త్రం వుండనే వుందయ్యో ! ఇవ్వాళ మిమ్మల్ని శాస్త్రవిద్యావేత్తలుగా తయారు చెయ్యటం నావల్ల నవుతుందా ?’ అని ఒక దండకం చదివింది. ఆ కుర్రవానికి అంతా అగమ్యగోచరంగా వుంది. అయినా, దగ్గరగా రమ్మన్నప్పుడు వెనుకాడడం నచ్చలేదు. ఆ పని హృదయానికి, సంకోచంగా కిటికీవద్దకు వచ్చాడు. ఈలోగా వంటమనిషి మునెమ్మ ‘ట్రే’లో బోర్న్‌విటా, బిస్కట్లూ తెచ్చి టీపాయ్ మీద పెట్టి కిటికీ వెంపు చూసింది. కిటికీ ఊచల ఆవల బిక్కుగా నించున్న పిల్లవాణ్ణి,

కిటికీ ఈవల సుందరమ్మ ముఖంలోని కల్పిత కోపోద్దీపన రేఖల్ని చూసి, మునెమ్మ మనస్సు క్షణం అవ్యక్తవ్యథతో గిజ గిజ లాడింది

'ఏమి చేశావు రాఘూ'! అమ్మగారికి అంతగా కోపం వచ్చిందీ?' భయంగా కుర్రవాణ్ని అడిగింది మునెమ్మ.

'కరేపాకు మొక్కకు బోదె చేస్తున్నానమ్మా' విని యంగా చెప్పాడు రాఘూ.

'అరే! నువ్వు ఎవరు? మా బాలూ అనుకున్నాను!' అనిఆశ్చర్యపోయింది సుందరమ్మ.

'అమ్మా బ్రేక్‌ఫాస్ట్ తీసుకోండమ్మా!' మునెమ్మ వినయంగా సుందరమ్మని హెచ్చరించింది.

'ఈ పిల్లడెవరు? మాబాలూ అనుకున్నాను. అటు తిరిగిరా! చూస్తాను' అని నెమ్మదిగా మంచందిగి టీపాయ్ దగ్గరగా వున్న చిన్న కుర్చీలో కూర్చుని బిస్కట్లు తినసాగింది సుందరమ్మ రాఘూ బిక్కముఖం వేసుకొని సుందరమ్మ గది గుమ్మంవద్ద నిలుచున్నాడు.

'మాపిల్లాడేనండి! నిన్ననే తీసుకవచ్చాను. మీతో చెప్దామనుకున్నాను. కాని మీరు రాత్రి సినిమాచూసి పొద్దు పోయి వచ్చారు. ఉదయాన్నే కనిపించి చెప్దామనుకున్నాను. ఈ లోగా మీరే చూశారు' అంది మునెమ్మ.

'ఓ అవును! మీ పల్లెలో ఎక్కడో్ని నీ కొడుకు మీ అమ్మవద్ద వున్నాడని చెప్పావుకదూ! మీ అమ్మకూడా వచ్చిందా?' అంది సుందరమ్మ.

'అమ్మ ఇంక ఎన్నటికీ తిరిగిరాని చోటికి వెళ్లిపోయిం దండి. ఒక అన్న వున్నాడు. వాడికి వాడిపిల్లలే మహాభారంగా వున్నారు. అందుకని వాడు వీడ్ని పెంచలేమని చెప్పి పంపే శాడు!' విజ్ఞాపనగా అంది మునెమ్మ.

'అయితే వాడ్ని ఇంక ఎవరూ సాకటానికి లేరు అన్న మాట. పోనీ ఇక్కడే్న వుణ్ణియ్యి! 'బాలూ'కి సావాసంగా వుంటాడు. అరే! రాఘూ! సాయంకాలాలు మా బాలూతో ఆడుతూ వుండు. ప్రొద్దుటిపూట చెట్లకీ, పాదులకీ గొప్పులు త్రవ్వి నీరుపోస్తూ వుండు? సరేనా?' అని రేడియో టేబుల్ వద్దకు వెళ్లి కుర్చీలో కూర్చొని, రేడియో 'ట్యూన్' చేసింది సుందరమ్మ. మునెమ్మ తనకొడుకుని కూడా వుంచు కుందుకు, సుందరమ్మని ఎంతో ప్రాధేయపడాలనుకుంది. కాని సుందరమ్మ, మునెమ్మ ప్రార్థనలతో నిమిత్తం లేకుండ గానే, 'రాఘూ' అక్కడ వుండటానికి అంగీకరించటంతో 'మునెమ్మ'కి సుందరమ్మంటే గౌరవం కలిగింది. 'టీపాయ్' మీది ట్రే తీసుకుంది. మునెమ్మ సుందరమ్మ తినకుండగా. వదిలేసిన రెండున్నర బిస్కట్లూ బుద్ధిగా ముడుచుకు పడుకొని వున్న తెల్లని చిన్న బొచ్చుకుక్క పిల్లకి పెట్టి 'ఖాళీ! ట్రే తీసుకొని పోతుండగా 'బాలూ ఎక్కడ?' అంది సుందరమ్మ.

'స్టడీ' రూంలో 'హోం' వర్కు చేసుకుంటున్నా రమ్మా' అంది మునెమ్మ.

'చదువు అయిపోగానే నేను రమ్మన్నానని చెప్పు!' అంది సుందరమ్మ.

'సర్లెండి!' అనేసి బయటకు వెళ్లింది "రాధూ"తో సహా మునెమ్మ.

సుందరమ్మ రేడియో వింటూనే జుత్తు చిక్కు తీసుకో సాగింది.

'ఎందుకమ్మా? పిలిపించారుట?' తెల్లని సిల్కు పైజామా వేసుకొన్న పదేళ్ళ కుర్రవాడు అడిగాడు.

'ఇలా రారా!' అంది సుందరమ్మ, ఆమె దగ్గరగా వచ్చాడు కుర్రవాడు.

'మిల్కు తీసుకొన్నావా?' అనడిగింది.

'తీసుకున్నానమ్మా!' నమ్రతగా చెప్పాడు బాలూ.

హోంవర్కు చేశావా?' అంది.

'చేశానమ్మా' అన్నాడు క్షణంసేపు బాలూని పరీక్షగా చూసింది సుందరమ్మ.

గుండ్రముగా తెల్లగా వున్నాడు. చెంపకు చారడేసి కళ్ళు. నల్లని పట్టుదారాలతో సన్నగా అల్లిన జాలరులాంటి కనీనికలలో ముగ్ధమోహనంగా కనబడుతాడు 'బాలూ' ఆ

ముద్దొచ్చే మోముకి దీప్తిత గలకుండగా కుడిచెంపమీదుగా కుడికంటిక్రిందుగా శనగబద్దంత పుట్టుమచ్చ! ఆ పుట్టుమచ్చ కేసి దీక్షగా చూసింది. తల్లి తనని దీక్షగా చూడటం చూసి బాలూ కంగారుపడిపోయాడు.

'నిజంగా హోంవర్కు అంతా చేశానమ్మా!' బిక్కగా అన్నాడు బాలూ. తనయుడి బిక్కమోహం చూసేసరికి సుందరమ్మ మాతృహృదయం ఆర్ద్రత పొందింది.

"ఛ! దానికాకాదురా నాన్నా!" అంటూ బాలూని దగ్గరికి తీసుకొని ఆపుట్టుమచ్చమీద గట్టిగా ముద్దుపెట్టుకుంది. తాను తల్లి నించి వూహించని, ఈ అకస్మాత్తు ఆప్యాయతకి వుక్కిరి బిక్కిరయిపోయింది ఆపరిణత పొందని పసిహృదయం!

"ఏమిటమ్మా మీరిలా..." దగ్గరగా వచ్చిన మాతృ హృదయాన్ని అడిగాడు బాలూ.

'ఏమీలేదు బుద్ధిగా చదువుకో! సాయంకాలం చల్ల బడినాక, బంతితో 'రాఘూ'తో తోటలో ఆడుకో ' వెళ్ళు" అంది సుందరమ్మ. ఆజ్ఞామూర్తిగా కనిపించిన తల్లి వెంపు విస్మితదృష్టితో చూస్తూ, 'బాలూ' గదినించి బయటికి వెళ్లి పోయాడు 'రాఘూ' ఎవరని కాని ఎందుకు మనింట్లో వుంటు న్నాడని కాని అడగలేదు 'బాలూ'. బాలూ కాన్వెంటులో ఎయిత్ స్టాండర్డ్ చదువుతున్నాడు. ఎదురుప్రశ్నలు వేయటం 'బాలూ'కి అలవాటులేదు. అమ్మ చెప్పినట్లు విని తలూపటమే "బాలూకి" తెలుసును. సుందరమ్మ హోంసైన్స్ గ్రాడ్యు యేటు కావడమే పిల్లవాణ్ణి ఇంత కట్టుదిట్టాలో పెంచటానికి కారణమని సుందరమ్మ భర్త మధుసూదనం. పరిహాసం

చేస్తూ వుంటాడు. కాని భర్త, పరిహసించినంత మాత్రాన్న పిల్లడిపట్ల తన ప్రవర్తనని కాస్తంత సౌలభ్యంగా మార్చు కోవటానికి అంగీకరించి పోయేటంత నీరసురాలుకాదు సుంద రమ్మ. నిజానికి బాలూ అంటే పంచప్రాణాలూ విడుస్తుంది సుందరమ్మ. ఏకైకసంతానం. అందులో మగపిల్లవాడు అయితే ఏస్త్రీకి ప్రాణప్రదంగా వుండదు ? కాని, ఎందుకని ఆమె తన పుత్రప్రేమని బహిర్గతం చేయకుండగా ఆపసివాణ్ణి చేతుల్తో లాలి చకుండగా వుంటుంది? తన అప్యాయతని మనో గతంగా ఎందుకు దాచుకుంటుంది ? దానికి అమె జవాబు ఇలా తనలో తానుగా చెప్పుకుంటుంది.

“అవును ! పిల్లలపట్ల మనం నిర్దాక్షిణ్యాధోరణే అవలం బించాలి. ఎక్కువ అప్యాయత ప్రదర్శిస్తే, అది ఆ పిల్లలు లోకువకింద తీసుకొని, నీతి, నిజాయితీలకి ప్రాధాన్యత నివ్వ కుండగా, విద్యావివేకాలకి దూరమై లాలసత్వంతో క్రుంగి పోతారు. అప్పుడు విచారించీ లాభంవుండదు. వివేకహీనుల ప్రేమ విషతుల్యము అవుతుంది. ఒకసారి స్త్రీ కాని. పురుషుడు కాని పతనావస్థలోకి దిగజారాక ఆ నీడల జాడలు ఆ వ్యక్తిని పవిత్రాంతమూ వెన్నంటుతూనే వుంటాయి. అందుకని పిల్లల జీట్ల కాస్త కఠినత్వమే చూపెట్టటం వాళ్ళ ఉజ్జ్వలభవిష్యత్తుకి వెలుగుబాట అవుతుంది’ ‘అందువల్ల అమె హృదయ సాగరంలో మాతృత్వపు మమతా కెరటాలు ఎంత మహోన్న తంగావెగసిపడుతోన్నావాటిని, హృదయములోనేఅణచివైచి, బాలూపట్ల ఆజ్ఞాధోరణిని అవలంబించేది ... ... ...

* * *

రోజల్లా బాగా మబ్బుపట్టి వర్షం కురిసి, సాయంకాలం అయిదుగంటలకి తెరిపి ఇచ్చింది. నెలజీతం అంతా క్లబ్బులో పేకాట ఆడి, ఓడిపోయి, మిగిలిన అణాన్నరతోనూ మల్లె పూలు కొని తెచ్చిపెడితే, పెద్దముఖం చేసుకుని మురిసిపోయే జూదగాని భార్యలా, సంధ్యాకాంత, తన ప్రేమానురాగాల్ని, మబ్బుల చివర్నించి పరుస్తో కొద్దికొద్దిగా బయటి ప్రపంచాన్ని తొంగిచూస్తో, మురుస్తోంది. ఓడిపోయిన జూదగాడిలా సూర్యుడు ముఖం లజ్జతో కందిపోగా, త్వరత్వరగా, పశ్చిమాద్రికి వెళ్ళిపోతున్నాడు. అప్పుడే వరండాలోకి వచ్చి నించున్న తెల్లగా పొడుగ్గా నాజుగ్గావున్న ఒక అమ్మాయి 'లాన్'మీద తడిసి విరిసిన, సన్నజాజి పూల సౌరభానికి, మత్తుగా కన్నులు అరమోడ్చింది. కాస్త దూరంగా జాజి పందెర నానుకుని నించున్న పోకచెట్ల ఆకుల చివర్లనించి, అప్పుడొక వర్షపుచినుకూ, అప్పుడొక వర్షపుచినుకూ, మెరుస్తో, మురుస్తో పుడమికాంతిని జేరుకుంటున్నాయి. ఆ ఆనందకరమైన ప్రకృతిలో, తన్మయావస్థలోవున్న ఆపిల్లది గేట్లో కారు ఆగటంకానీ, అందులో ఫుల్‌సూట్‌లోవున్న ఒక నవయువకుడు తనవెంపు రావడంకానీ చూడలేదు.

'ఏమిటంత దిగ్భ్రమగా నిలబడిపోయేవు?' చనువుగా ఆమె భుజంమీద చేయివేసి అడిగాడు. ఉలిక్కిపడింది ఆసుందరి.

'మీరా!' అంది.

'నేనుకాక!' కవ్విస్తో, ఆమె విశాలనయనాలలోకిచూడ బోయాడు. ఆమె చటుక్కునతన కలువరేకుల్ని క్రిందికివాల్చి-

'లోపలికి పదండి!' అంది. హాలులోకినడుస్తో, మెత్తగా పట్టులా మెరమిసొంచి మోకాలి మడతవరకూ జారుతోన్న ఆమె పరిమళభరితమైన జుత్తుని చూస్తో లోపలికి నడిచాడు.

'కూర్చోండి!' అంది.

బుద్ధిగా అక్కడున్న సోఫాలో కూర్చున్నాడు. కోరికలతో మండుతో, నిప్పురవ్వల్లా, ప్రజ్వరిల్లుతున్న అతని లోతైన కళ్ళల్లోకి ఆశగా చూసింది.

'ఒకమాట చెప్పాలి!' అంది.

'ఏమిటి! ఇంతఆలోచనా దానికి!' నవ్వుతోన్న పెదిమల మధ్యనించి, ముత్యాల్లాంటి పలువరుస కనీకనిపించక దోబూచులాడింది.

'ఇరవయి తారీకుతో మీ పరీక్షలు ఆఖరుకదా?

'అవునూ!' సందేహంగా అడిగాడు ఆ యువకుడు

'అయితే ఫరవాలేదు. నా పరీక్షలు ఇరవయినాలుగు దాకా వున్నాయి! ఇరవయిఎనిమిదో తారీకున ముహూర్తం స్థిరపరచారు నాన్న! ముద్దుగా అంది సుందరి. అ యువకుని వళ్ళు జలదరించింది. పెళ్ళి కాకుండగా తనతో అంతస్వేచ్ఛగా విహరించింది. స్వేచ్ఛావిహారిణి అయిన ఆ పిల్లతో తను జీవితాంతం గడపటమెల్లాగు? ఆ పిల్లని సహభాగినిగా తానెన్నడూ వూహించలేదు. అందుతోన్న ఆనందామృతాన్ని కాలదన్నుకోకుండా' స్వీకరించాడు. దానికి తన్ని బంధితుడ్ని చేయాలని చూస్తోందా ఈమె!'

కథా నిలయం
872

'నీకు మతిగాని పోతోందా సుందరీ! అప్పుడే మనకు పెళ్ళేందుకు! నేనింకా రిసెర్చి చెయ్యాలి! నువ్వు మాస్టరుడిగ్రీ పుచ్చుకోవాలి! ఈలోగా తొందర ఎందుకు?' లాలనగా అన్నాడు.

'అవును రాయబాబూ! నీవన్నది నిజం. అప్పుడే మన పెళ్ళికేం తొందరలేదు. ఏకంగా మనవల్ని ఎత్తేక చేసుకోవచ్చును. పెళ్ళికి తొందర లేనివాడివి తండ్రివవటానికి అంత తొందరెందుకు చూపావ్?' ఎకసక్కెంగా అంది సుందరి.

రాయబాబుకి అరికాలుమంట నెత్తికెక్కింది.

'ఏమన్నావు? తండ్రి కాబోతున్నానా! అది నావల్లనే అంటావా? నీకున్న వందలాది స్నేహితుల్లో ఎవరివల్లనో జరిగిన ఈ అకార్యాన్ని నామీవసాయిస్టు చేసినన్ను బందిద్దామనుకుంటున్నావా! డబ్బుపోతే మళ్ళీ పోగుచేసుకోవచ్చును కాని మానంపోతే మళ్ళీ కూడదీసుకోలేరు ఎవ్వరూ! విసురుగా అని పైకిలేచాడు రాయబాబు. సుందరి నిర్ఘాంతపోయింది. అతని నవ్వే పెదాల నించి, ఇంత విషలిప్తములైన మాటలు వస్తాయని కలలోకూడ వూహించలేదు సుందరి. అతని కళ్ళల్లోని కాంతి, ఆరని ప్రేమ జ్యోతి అనుకుంది కాని అది తీరని, రూపతృష్ణ అని ఇప్పుడు గమనించింది సుందరి. కడుపులో ఏదో బాధ జనించింది ఎవరి వల్ల జరిగింది ఇంత అకార్యం? ఇల్లా ప్రవర్తిస్తే ఇంత పశ్చాత్తాప పడవలసి వస్తుందని తనకు చెప్పేందుకు వెనుక ఎవ్వరూ లేరు. తనతల్లే వుంటే, తన్ని తగిన అదుపాజ్ఞల్లో పెట్టేదేమో! తను తల్లి ప్రేమకి నోచుకోలేదు. తండ్రి తను

కోరిందల్లా చేయటమే కాని ఇది మంచీ, ఇది చెడ్డా అని చెప్పి వుండలేదు. ఎప్పుడూ ఏమంటే, తాను అనుచితంగా తలచి బాధ పడుతుందో అని తండ్రిభయం! అందుకని తమ స్టేటస్‌కి ఏ విధంగానూ సరితూగని రాయబాబుని తను వివాహ మాడతానని చెప్పినప్పుడు లోపల ఏమన్నా అనుకోనివున్నా పైకిమటుకు చిరునవ్వు నవ్వి "అల్లాగే చేసుకోమ్మా" అనేశారు. నాలుగేళ్ళుగా ఇద్దరూ కలిసి తిరిగారు. అసలు అందరితో సోషల్‌గా వుండాలని రాయబాబే స్వయంగా తన క్లాసుమేట్సుతోనూ పరిచయం చేశాడు. అతనిమీద తనకి సర్వహక్కులు వున్నాయనుకొంది.

ధవళపన్నగముతో స్నేహంచేస్తే ఎంత ప్రయోజనం కలుగుతుందో, విలాసపురుషులతో స్నేహంచేసినా అంతే ప్రయోజనం కలుగుతుంది. ఎన్ని రోజులుగా మనం దాన్ని ప్రేమగా చూసినా ముద్దుపెట్టుకోబోయే సమయానికి కాటువేసి తీరుతుంది విలాసపురుషులూ అంతే! ఎంత నిర్మలమైన ప్రేమతో తన శరీరాన్ని స్త్రీ సమర్పితం చేసుకొన్నా, ఆస్త్రీకి వారిచ్చే విలువ కాముకతే! రాముబాబులాంటి యువకుడు ఎవర్నీ ప్రేమించలేదు. ప్రేమంటే రాయబాబు డిక్షనరీలో శరీరాన్ని అనుభవించటం! అలాంటి రాయబాబుయొక్క ప్రేమని కొని, విరసీ విరయని పూవులాంటి సుందరి దీపశిఖ చుట్టూ పరిభ్రమించే మిడతలా మాడిపోయిందంటే, ఆశ్చర్యమేముందీ?

సుందరి అర్ధగంటసేపు మౌనంగా నిలబడింది. పాలరాతి బొమ్మలా నిలుచున్న సుందరి వెంపు అప్రతిభుడై చూస్తూ నిలుచుండిపోయాడు. రాయబాబు తనకాళ్ళకి చుట్టుకొని ఏడ్చి మొత్తుకుంటుందనుకొన్న సుందరి, అల్లా హొంపుగా సుందరంగా నిలబడిపోవటం రాయబాబుకి ఆశ్చర్యాన్నే కలిగించింది. అతనితో స్నేహంచేసి వంచింపబడ్డ స్త్రీలందరూ అతని కాళ్ళావేళ్ళాపడి బతిమాలుకున్నవారే. అందులో ఒక యువతి ఆత్మహత్య చేసుకోవడందాకా వెళ్ళిపోయింది. అల్లాంటిది-సుందరి మౌనగంభీరం చూస్తోంటే ఉరుముబోయే ముందు మెరుపు స్ఫురించింది రాయబాబుకి.

సుందరి మృదువుగా రాయబాబు కళ్ళల్లోకి చూసి నవ్వింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, అతన్ని సమీపించింది. అతని మెలికలు తిరిగే క్రాఫింగ్ జుత్తులోనికి తన కుడిచేతి వేళ్ళు జొనిపి పట్టుకుంది. ఇదివరలో ఆమె అలా ఎన్నోసార్లు ఆ జుత్తుని అలా పట్టుకుని నిమురుతూ, అతని నుదురుని ముద్దాడేది. అది అతని శరీరం అంతట పులకలు కలిగించేది. తను అంత కఠినంగా తిరస్కరించినా, ఆమె చూపుతోన్న లాలనా భావనకి ముగ్ధుడైనాడు రాయబాబు.

'అదికాదు సుందీ' అనాలోచితంగా ఏదో చెప్పబోతున్నాడు.

'డోంటాక్ రాస్కెల్ !'

అతని నెత్తిమీద ఆమెచేతి సున్నితమైన వ్రేళ్ళు బిగుచుకున్నాయి. కసిదీరా, అతని చెంపమీద ఎడమచేత్తో టపీ టపీ మని బాదసాగింది. రాయబాబుకి కనీసం పెనుగులాడి విడిపించుకొని బయట పడదామన్న వూహకూడా రాలేదు. నిర్వీర్యుడై, అల్లా దెబ్బలుతింటూ ఉండిపోయేడు.

'ఇంక చాలమ్మా! నిష్కారణంగా చచ్చి వూరుకొంటాడు. హత్యాపరాధం కూడా నెత్తికి చుట్టుకుంటుంది. వదిలెయ్! ఇదుగో! ఇక మీదట ఈ రోడ్డుమీద నీకారు నెంబరు కనిపించిందంటే షూటు చేసేస్తాను. ఫో!" అన్నారు వెనకనించి సుందరి తండ్రి గంగాధరంగారు.

సుందరికి అప్పటిదాకా వెనకగదిలో తన తండ్రి వున్నారన్న స్పృహలో లేదు. తండ్రి గొంతు వినగానే రాయబాబుని వదలి, ఒక్క పరుగులో తండ్రి దగ్గరకువెళ్ళి ఆయన కాళ్ళను చుట్టుకపోయి, 'నాన్నా' అని బావురుమంటూ ఏడ్చేసింది. రాయబాబు వెనక్కి తిరిగి చూడకుండా పడుతూ లేస్తూ తన కారుని సమీపించి అందులో కూలబడ్డాడు.

"ధైర్యంగా వుండాలమ్మా, నువ్వేం దిగులుపడకు. జరగవలసినదానికి నిబ్బరంగా ముందంజ వెయ్యి" అన్నాడు గంగాధరంగారు సుందరి చెంపలని ప్రేమగా నిమురుతూ.

"అంతా సర్వనాశనం అయిపోయింది నాన్నా! ఇంకెక్కడనించి ధైర్యం కూడగట్టుకోనూ!" అని విలవిల్లాడింది సుందరి.

"ఎవరి అంతర్యాలు ఎల్లాంటివో మన కేం తెలుస్తాయి తల్లీ! పైకి పెద్దమనిషిలా వచ్చాడు. ప్రేమగా, ఆత్మీయతగా మాట్లాడాడు. నీకు తగినవ్యక్తి అనుకున్నావు. నమ్మావు. మనసిచ్చావు. అతను మనసు కావాల్సినవ్యక్తి కాదు. శరీరప్రేమ! మనోకాంక్ష కాదు అతని పైశాచికకాంక్ష, విద్యావిజ్ఞానాల అట్టడుగున దాగి, మనుష్యుల్ని ప్రలోభపెట్టుంది అది నీతప్పు కాదు. ఇల్లాంటి అవజ్ఞత, ఏ ఆడపిల్ల పట్లయినా జరిగేదే! చూడు. అనవసరంగా బాధపడకు" అన్నారు గంగాధరంగారు. తండ్రి ఒక్కో మెట్టు మేడపైకి ఎక్కుతోంటే తను మానసికంగా ఒక్కో మెట్టు అధఃపతనమైనట్లు భావన రాగా కుంచించుకపోయింది సుందరి... ...

*  *  *

"అబ్బ ఈ పుట్టుమచ్చ ఇక్కడెంత కాంతిగా ప్రకాశిస్తోందో చూడు!" అన్న మధుసూదనం మాటలకి తడబడుతూ కొద్దిగా తలెత్తి అతని ముఖంలోనికి చూసింది. అతని కుడి కంటి క్రిందుగా పచ్చని చెంపమీదుగా మురిపిస్తూ నల్లిలా కనపడిన, శనగబద్దంత పుట్టుమచ్చనే చూస్తూండిపోయింది.

మధుసూదనం, భార్య విశాల వినీల నయనాలలోని విస్ఫారిత దృష్టికి ముగ్ధుడైనాడు.

నవ్వుతూ 'అక్కడకాదోయ్! ఇక్కడ?' అన్నాడు. సుందరి ప్రశ్నార్ధకంగా ముఖం పెట్టింది. పచ్చని లోనెక్ చోళీ లోంచి, ఎడమ జిక్షోజం మీదుగా గిలిగింతలు పెడుతూన్న

ఆవగింజంత పుట్టుమచ్చని వ్రేలితో చూపాడు. సుందరి వళ్ళు జలదరించింది. రాయబాబుకూడా, ఎన్నోసార్లు 'నీ అందానికి ఆయువుపట్టు!' అంటూ వ్రేలితో తాకి ముద్దు పెట్టుకునేవాడు. అదే మచ్చ ఈతనికీ, హాయిలైట్‌గా ఎల్లా కనబడిందీ! మగవాళ్ళ దృష్టి అందరిదీ ఒకలానే ప్రసారిత మవుతుందా!

"మీకెల్లా కనపడిందీ! నా పుట్టుమచ్చ అందరికీ కన పడదే!' ఆశ్చర్యంగా అంది సుందరి.

'అవును! నీ పుట్టుమచ్చ అపురూపంగా దర్శనమిచ్చి మురిపిస్తుంది!' అన్నాడు మధుసూదనం

'మరి మీ పుట్టుమచ్చ అక్కరలేనివారికి కూడ ఆనంద మిస్తూంది కదా! అంది సుందరి చిలిపిగా.

"అసలు పుట్టుమచ్చలు లేనివారంటూ వుండరా?" అన్నాడు జిజ్ఞాసగా మధుసూదనం.

'అంతర్గతంగానో, బహిర్గతంగానో పుట్టుమచ్చలు లేకుండగా వుండరేమో!" అంది సుందరి.

"ఏది ఏమయినా మన వుభయుల పుట్టుమచ్చలూ ఒకరివి ఒకరికి ప్రీతి పాత్రంగా వున్నాయి కదా!" అన్నాడు మధుసూధనం.

తొలి సమాగమంలో భర్త తనపట్ల ఇంత అనురాగం ప్రదర్శిస్తాడని వూహించుకోలేదు సుందరి. మంగళసూత్రం తామిద్దర్నీ బంధించేదాకా ఒకరి మోహం ఒకరు స్ఫుటంగా

చూసుకోని ఎరుగరు. అనుకోనివిధంగా భర్తనించి ఆప్యాయత లభించటంతో సుందరి మానసికంగా కృంగిపోయింది. ఇంత నిర్మలానురాగంతో వర్తిస్తున్న దైవసమానుడయిన మధుసూదనంకి ఆంతరంగికంగా పతితురాలైన తను అర్ధాంగిగా ఎల్లా అయిందా అని ఆమె అంతర్గతంగావిలపించింది. అయినా తప్పదు. ధైర్యంగా తను తన జీవన ప్రాంగణంలోనికిముందంజ వేయాలి. అనుకుని తండ్రి తనపట్లపడ్డ ప్రయాసని జ్ఞప్తికి తెచ్చుకుని చిరునవ్వుని ముఖానికి పులుముకుంది సుందరి. అనుకోకుండానే ఆ రోజు వుదయం నించీ, తమ యింట్లో జరిగిన సంఘటనలు గుర్తుకు రాసాగినయ్. ఆ రోజు మధుసూదనం భార్యని తీసుకుని ఇంటికి వచ్చిన రోజు. సుందరితో కూడా, తండ్రీ, కొందరు బంధువులూ, సుందరి క్లాస్‌మేట్స్ ఏడెనిమిది మందీ వచ్చారు వూరు చూడటానికి చిన్న పల్లెటూరయినా, మధుసూదనం నాన్నచంద్రశేఖరంగారి భవంతి మట్టుకు, పెద్ద రాజమహల్‌లా వుంటుంది. చంద్రశేఖరంగారికి మధుసూదనం ఒక్కగానొక్క కొడుకు. అతన్ని వదలి వుండలేక మధుసూదనం బి. ఇ. ప్యాసయినా వుద్యోగానికి వెళ్ళనియ్యలేదు చంద్రశేఖరంగారు. ఇంజనీయర్‌గా ఏ దూర ప్రాంతానికయినా వెళ్ళిపోతే తప్పుదారులు తొక్కుతాడేమో అని ఆయన భయం. అనుకోకుండా హైకోర్టు జడ్జి అయిన గంగాధరంగారు ఆయన కూతుర్ని ఇస్తామని రావడంతో చంద్రశేఖరంగారు ఆయన భార్య రాజమ్మగారుకూడా సంబరపడ్డారు. చదువుకున్నదీ, అందమైనదీ, అయిన సుందరి మధు

సూదనం భార్య అయితే, అతను కాలు జారటానికి అవకాశం వుండదు కనుక వెంటనే ఉద్యోగంలో కూడా చేరమని సలహా ఇచ్చారు చంద్రశేఖరంగారు. పెళ్ళిఖాయమనగానే ఉద్యోగానికి అప్లయిచేసాడు మధుసూదనం.

పై డాబా మీద గంగాధరంగారు చేతులు వెనక్కి మడచికొని ఇటూ అటూ పచార్లుచేస్తున్నారు చంద్రశేఖరం గారు అక్కడేవున్న ఒక చిన్న కుర్చీలో కూర్చుని లంక పొగాకు చుట్ట వెలిగించారు. ఎవరోదూరపుబంధువు ఒకాయన వచ్చాడు. గంగాధరంగారు వినయంగా నమస్కరించారు

ఆఁ! నువ్వేనా నాయనా? మా శేఖరం వియ్యంకుడివి? మీరు ముందునించీ చెన్నయ్యగారి రాయబాబుకి మీ అమ్మాయిని ఇద్దామనుకున్నారుట? ఉభయులకీ రాకపోకలు కూడా జోరుగా జరిగేవిట కాదూ? మరి మానేసి ఈ కోన సీమదాకా వచ్చేవేం బాబూ!' అని అన్నాడు. చంద్రశేఖరం గారు ఒక్కనిమిషం గంగాధరంగారిని పరిస్తాయించి చూసేరు ప్రక్కగదిలో తన సమవయస్కులతో కూర్చున్న సుందరి తల భూమిమీదికి వంగిపోయింది సుందరి సఖీజనం చెవులు నించున్నాయి, గంగాధరంగారు మాత్రం తొణకలేదు, బెణకలేదు.

"అవునండీ! అబ్బాయి చదువుకున్నవాడుకదా? వున్నవూళ్ళోనే కంటికెదురుగా వుంటుంది. అమ్మాయిని ఇద్దామనుకున్నాను. కాని ఆ అబ్బాయి కనుసైగచేయని అమ్మాయి లేదని, కొంతమంది మేజిస్ట్రేట్ వద్ద కేసులుకూడా

బనాయించారనీ తెలిసి మానుకున్నాను. చూసిచూసీ అల్లాంటి నైతిక పతనుడికి ఎల్లా కట్టబెట్టను ? విద్య వున్నా. ధనం వున్నా నైతికవిలువలని పాటించని మనిషి పశువుతో సమానం? అంచేత దూరమయినా, భారమైనా మధుసూదనంగారి నిశ్చలమయిన నడవడి విని వారికే ఇచ్చాను

ఆస్తిపాస్తులు పోయినా, మళ్ళీ సంపాదించొచ్చును. మాన మర్యాదలు మళ్ళీ డబ్బుపోసి పునః ప్రతిష్ఠించుకో గలమా ?' గంభీరంగా అన్నారు గంగాధరంగారు. గర్వంగా వొంపుతిరిగిన మీసంమీాద చేయివేసి తృప్తిగా నవ్వుకున్న చంద్రశేఖరంగారి నవ్వు సుందరికి వినబడకపోలేదు. కర్తవ్యతా విమూఢలా కూర్చున్న సుందరిని చుట్టూవున్న అమ్మాయిలు పరిహాసాలు చేస్తున్నారు.

"కాస్సేపు నవ్వుతూ మాట్లాడవే తల్లీ ! ఎప్పుడో రాత్రి పదిగంటల తరువాత జరుగబోయే సమావేశానికి ఇప్పట్నించే కలలుకనాలా ?" అన్నది ఒకామె.

'అదికాదే ! తల్లీ ! తలన్నా ఎత్తకుండా, నిజం పెళ్ళి కూతురిలా ఎల్లా కూర్చున్నావే ? కాస్త తలెత్తి మా ముఖాల వెంపు చూడకూడదూ ? మూడురోజులనించీ నీ ముఖ చంద్ర బింబహాసానికి కలవరించిపోతున్న ఈ కలువకన్నెలని కన్నెత్తి చూడరాదటే ?" అన్నది వేరొక యువతి.

"దానికి కారణం బొండు కలదు చెలీ ! సావధాన చిత్తలై ఆకర్ణింపుడు. ద్వాపరయుగములో, గోపిక లందరికీ ఒండొరుల ముఖములలో, శ్రీకృష్ణ ప్రతిబింబమే కానవచ్చెడి

దట! అటులనే ఈ కలియుగములో మన ప్రేమైకసుధామూర్తి అగు సుందరికి కూడా ఎవ్వరి ముఖ కమలమందు దృష్టి ప్రసారించినా, శ్రీ మధుసూదనుల వారి ప్రతిబింబమే కాన వచ్చెను కాబోలున్న! అందుచే ఇయ్యాగురుబోణి. తల ఎత్త లేనంత లజ్జావివశురాలవుతున్నది.' అని గ్రాంధికంగా చెప్పింది ఒక రెండు జడల అమ్మాయి !

'ఏమోనమ్మా! వచ్చేది పల్లెటూరుకదా! వచ్చీ రాగానే కోరస్‌లు పాడుకుంటూ పొలాలగట్లమ్మట పరు గెత్తుతూ చెరువులో ఈతలు కొట్టూ గడపొచ్చని సరదాపడి వచ్చాను. అసలు హీరోయిన్ కదలందే ఏమి చేసేది? ముద్ద పప్పులా ఇంటికి జేరింది మొదలు గదిగుమ్మంవదలి బయటికి రావటంలేదు' అంది ఇంకో యువతి.

'మరేనే! ఆ ఇంజనీయర్‌గారుకూడా ఈమెగారికి తగ్గ వాడేనే! పెద్దచదువు చదివాడేకాని, సోషల్‌గా వుంటం చాతకాదు. ఆడపిల్ల కనిపిస్తే ఆమడ దూరంలో వుంటాడు. కాస్త పలకరిస్తేనే కొరుక్కుతింటామా ఏమిటి?'' అన్నది. ఇల్లా వాళ్ళల్లో వాళ్ళు నవ్వుకుంటున్నారు. తుళ్ళుకొంటు న్నారు. మాట్లాడుకుంటున్నారు సుందరి మట్టుకు వాళ్ళ కఠిన పరిహాసోక్తులకు ఏమాత్రం చలించకుండా కూర్చొంది. ఆమె మనస్సు రాబోయే భర్తృసమాగమంగురించి ఆందోళితమయి వుంది అప్పుడు.

సుందరి కొద్దిగా సంకోచిస్తూనేమధుసూదనానికి లొంగి పోయింది...

చాలా రోజులకి రాజమ్మకి కోడలు దగ్గిర ఒక నెల రోజు లుండాలని బుద్ధిపుట్టింది. కొడుక్కు-వుత్తరం వ్రాసింది. ఇక్కడ భర్తగారి అనుజ్ఞ కోరింది. కొడుక్కు వ్రాసిన ఉత్తరానికి కోడలు జవాబు వ్రాసింది వెంటనే బయలుదేరి రావాల్సిందని

'చూడండి, మన కోడలు ఎంత గుణవంతురాలో! కొడుకు కాంప్‌కి వెళ్ళాడు కాబోలున్న వెంటనే తను జవాబు వ్రాసింది'అని భర్తతో చెప్పి మురిసింది.

'సర్లే! ఒక్కత్తివీమట్టుకు బయలుదేరకు! నౌకరు రామన్నని వెంటపెట్టుకొని వెళ్ళు!' అన్నారు చంద్రశేఖరం గారు, కాంప్‌నించి మధుసూదనంగారూ, ఇంటిదగ్గర్నించి రాజమ్మా ఒక్కరోజే బయల్దేరి ఒక్కసారే ఇల్లు చేరుకున్నారు. వాకిట్లో కారాగిన చప్పుడు వినగానే సుందరమ్మ బాల్కనీలోకి వచ్చి నిలబడింది. భర్తగారూ, అత్తగారూ రావడం గమనించి సంతోషంగా తల వూపింది. మధుసూదనందృష్టి వస్తూనే తోటలో సపోటా చెట్టు ఎక్కి ఒక్కొక్కాయే పదిలంగాకోసి, నిక్కరు జేబులోకి తోస్తూన్న 'రాఘూ' మీదనే పడింది.

'అరే! బాలూ చెట్టు ఎక్కావా! పడతావ్, కాలు విరుగుతుందని నీ కెన్నిసార్లు చెప్పాను? దిగిరా! ఇదిగో ఎవరు వచ్చారో చూశావా మనింటికి! బామ్మ వచ్చిందిరా! బామ్మ!' అన్నాడు. 'రాఘూ' వెనక్కి తిరిగి చూశాడు. రాఘూ ఆ ఇంటికి వచ్చిన రెణ్ణెల్లకీ మధుసూదనాన్నిచూడటం

అదే మొదటిసారి. ఒకసారి ఆయన వచ్చేసమయానికి 'రాఘూ'కి జ్వరం తగిలింది. అంచేత ఇంటిలో ఇటూ, అటూ తిరగ కుండా వంటగది ఎదురుగావున్న చిన్నగదిలో పడుకున్నాడు. ఇంకోసారి ఆయన వచ్చేసరికి బాలూ ఎక్స్కర్షనకి వెళ్ళితే, వాడి సామాను మోస్తూ, సాయితాగా వుండటానికి బాలూ వెంట వెళ్ళిపోయేడు రాఘూ బాలూలానే బుద్ధిమంతతనంగా వుంటాడు. పచ్చని శరీరంతో తీర్చిదిద్దిన ముఖభంగిములతో అహంభావికంగావున్న సుందరమ్మ రాఘూకి లక్ష్మివిగ్రహంలా కన్పించుతుంది.

'అయ్యగారు అయివుంటారు.' వెనక్కి తిరిగి చూసిన రాఘూ అనుకున్నాడు. చటుక్కున ఒక్కగెంతు సపోటా చెట్టుమీంచి క్రిందకు గెంతి, రాజమ్మనీ, మధుసూధనాన్నీ సమీపించాడు. మధుసూదనం 'రాఘూ'ని చూసి ఉలిక్కి పడ్డాడు. వెనకాలే సూటుకేసూ పళ్ళబుట్టా తెచ్చి ఎక్కడ పెట్టాలన్నా అని ఆలోచిస్తూ నిలబడిన 'రామన్న'

'అరే రాఘాయ్! ఎల్లా వచ్చావిక్కడికి?' అద్భుత పడి అన్నాడు.

రాఘూ రామన్నను చూసి భయపడ్డాడు. గట్టిగా ఏడ్వ టం మొదలెట్టాడు. వాడి ఏడుపువిని, వంటింట్లోవున్న మునెమ్మ పరుగెత్తుకుని వచ్చింది. మునెమ్మ రాఘూని పలక బారిన సపోటాకాయలన్నీ కోయమని పురమాయించింది. ఒకవేళ చెట్టుదిగుతూ పడిపోయేడేమో అని 'గాభరాపడి బయటికి వచ్చింది. అక్కడ ఎవరూ ఏమి మాట్లాడాలో

తెలియకుండగా చిత్తరువుల్లా నిలబడిపోయిన మధుసూదనం, రాజమ్మ, రామన్నా, ఆమె కళ్ళకి కనపడ్డారు. రామన్నని చూడగానే మునెమ్మ కంపించిపోయింది. మునెమ్మని చూడ గానే మధుసూదనం శరీరం కుంచించుకపోయింది ఈ స్తంభీ భూత వాతావరణాన్నించి, వాళ్ళని తప్పించటానికి తెల్లని సాక్స్, తెల్లని బూట్స్, తెల్లని నిక్కరూ, తెల్లని బనీనూ, వేసుకున్న బాలూ పరుగెత్తుకుంటూవచ్చి, రాజమ్మనిచుట్టేసు కుని 'బామ్మా! నాకేం తెచ్చావ్!' అంటూ గారాలు పోయేడు. మధుసూదనం తలవంచుకొని గబగబా మేడకేసి వెళ్ళిపోయేడు రామన్న మునెమ్మకేసి కసిగాచూసి, పెట్టె, పళ్ళబుట్ట చేత్తో పుచ్చుకొని......

'ఎక్కడ పెట్టను అమ్మగోరూ ?' అంటూ ముందుకు కదిలాడు

'ఏమిరా, రాగాలు తీస్తున్నావ్ ?' అన్నాడు బాలూ రాధూని.

రాధూ ఒక్కసారి తల్లికేసి చూశాడు. మునెమ్మ కళ్లు చిట్లించింది.

'ఏం లేదు; అయ్యగోర్ని చూసి భయపడ్డాను' అన్నాడు.

'పద ఆడుకుందాం' అని తోటలోకి పరుగు తీశాడు బాలూ. రాధూ బాలూని అనుసరించాడు.

ఇద్దరు పిల్లలూ పరుగెట్టుతోంటే చూసి బాల్కనీమీద నించున్న సుందరమ్మ గాఢంగా నిట్టూర్చింది.

మునెమ్మ 'కవలల్లా వున్నారు' అనుకుంది.

మధుసూదనానికి మునెమ్మ తమ పాత వంటమనిషి సానే వచ్చి చేరిందని తెలీదు. అసలు మధుసూదనం నెలకి మొత్తంమీద ఏ పదిరోజులో ఇంట్లో వుంటాడు. అతనికి భోజనం వడ్డించటం, కాఫీ, టిఫెన్లు అందించటం సర్వసాధారణంగా సుందరమ్మ చేస్తుంది. అంచేత ఇంట్లో వంటింటి పనులు ఎవరెవరు చేస్తున్నారో మధుసూదనానికి తెలీదు. అతను అంతగా కలుగజేసుకోడుకూడా !

మునెమ్మ ఎల్లా ఆ ఇంట్లో స్థానం సంపాదించిందో సుందరమ్మని అడుగుదామని రెండుమూడుసార్లుఅనుకొన్నాడు మధుసూదనం. కాని, ఎందువల్లనో మునెమ్మ గురించిన ప్రసక్తి సుందరమ్మవద్ద తేవటానికి మధుసూదనానికి ధైర్యం చాలలేదు. అతను ఇంటిలోవున్న వారం, పదిరోజుల్లోమునెమ్మ ఒకటి రెండుసార్లు తప్ప ఎక్కువగా కనిపించలేదు. ఆ ఒకటి రెండుసార్లూ మునెమ్మ ఏదో కల్పించుకొని మధుసూదనాన్ని పలకరించబోవటమూ, మధుసూదనం ఆమెకి మాట్లాడటానికి సావకాశం యీయకుండగా తప్పించుకపోవటమూ చూచాయగా గ్రహించగల్గింది సుందరమ్మ.

మధుసూదనంవున్న వారం, పదిరోజులూ ఇంటిలో ఏ మార్పు లేకుండా జరిగిపోయింది. రామన్న బయటనించి ఏమి సామానుకావాల్సివున్నా హాజరుగా తెచ్చిపెట్టేవాడు. అప్పుడప్పుడు తోటలో రాధా నీళ్ళుతోడుతుండగా రామన్న వాడికి సాయితాగా వెళ్ళటం గమనించేది సుందరమ్మ.

పదిరోజులు పోయాక మధుసూదనం కాంప్‌కి వెళ్ళిపోయిన రెండోరోజు మధ్యాహ్నం ఒంటిగంటకి తను పడుకున్న గది కిటికీ క్రిందుగా డిశంబరు మొక్కల తుప్పల్లో ఏదో గడబిడజరిగినట్లు తోచగా చటుక్కున సుందరమ్మకి మెళుకువ వచ్చింది. నెమ్మదిగాలేచికిటికీదగ్గరికి వెళ్ళి చూసింది. 'రామన్న' మునెమ్మని డిశంబర్ మొక్కలతుప్పల్లోకి పడదోసి చేతి కంది నన్ని తన్నులూ, గుద్దులూ, వేస్తున్నాడు. మునెమ్మకి తను వున్నది సుందరమ్మ నిద్రపోతున్న గదిక్రింది చోటు అని తెలుసును. అందుచేత కళ్ళమ్మటనీళ్ళు అవిరళంగా ధారలు కట్తున్నా కిక్కురు మనకుండా మౌనంగా ఆదెబ్బలుభరిస్తోంది. సుందరమ్మ చూసి ఆగలేకపోయింది. గబగబా క్రిందికిదిగి వాళ్ళని సమీపించింది.

'ఏమిటి గొడవ రామన్నా, నిష్కారణంగా చంపేత్రావా ఏమిటి?' అని మందలించింది. మునెమ్మకి ప్రాణావశిష్టంగా వుంది. బరువుగా కనురెప్పలెత్తి సుందరమ్మ వంపు ప్రార్థనగా చూసింది.

'చంపేస్తే పాపం వుండదు అమ్మగోరూ! దీని కథలు తెలీక మీరు జేరనిచ్చారు.' వొగరుస్తూ అన్నాడు రామన్న.

'దానికి నీకూ సంబంధం ఏమిటి? జడ్జిగారి కూతురులానే ప్రశ్నించింది.

'ఇప్పుడేమీ సంబంధం లేదండి. రెండేళ్ళ క్రితందాకా భార్యగా వుండేది. నేను పెట్టే తిండి చాలక ఎటో లేచిపోయింది. పోతే పోనిమ్మని నేను పట్టించుకోలేదు. అల్లా

పోయింది పోకుండగా నా రక్తం పంచుకుని పుట్టిన పిల్లోణ్ని కూడా రెణ్నెల్ల కితం తీసుకొచ్చింది. ఇది లేచిపోయినా నేను విచారించలేదు నా రక్తం నింపుకున్న కొడుకును రెండేళ్ళా ప్రక్కలో పడుకోపెట్టుకొని పెంచుకున్నాను. వాణ్ని ఎల్లా అయినా చదివించుకుని, పెద్దోణ్ని చేయాలనుకుని ఆశపడ్డాను. ఒకరోజు నేను మీ అత్తోరింటికాడ పనిచేసుకుని వచ్చేసరికి పిల్లోడు లేడు ఎంతకని వెతికానో నెలాళ్లూ నిద్రాహారాలు మాని పిచ్చిపట్టినోడిలా ప్రతీ వూరూ గాలించాను. అన్ని దేవుళ్ళకీ మొక్కుకున్నాను. అనుకోకుండా ఇక్కడకనపడ్డాడు భగవంతుడు నాయం చూడడా! నా కొడుకుని నా కప్ప గించాడు' ఆగి గుక్క తిప్పుకున్నాడు రామన్న.

'నీ కొడుకుని నువ్వు తీసుకెళ్ళు. ఆ మాత్రం దానికి కొట్టుకోవడం ఎందుకు?' అంది సుందరమ్మ.

'మీకు తెల్దండి అమ్మగోరూ! ఇది బతికివుంటే నా కొడుకుని మళ్ళీ తీసుకెళ్ళి దాచేసుకుంటుంది అందుకని దీన్ని చంపేయాల!' కసిగాఅంటూ మళ్ళీ మునెమ్మను డొక్కలో ఒకతాపు తన్నాడు రామన్న.

'అట్లా ఈ ఇంటిఆవరణలో తన్ని చంపకు. నీకు ధైర్యం వుంటే రోడ్డు మీదకు తీసుకవెళ్ళి తన్నుకో. ఇక్కడ ఈ ఇంటిలో వుండగా మునెమ్మ మా వంట మనిషి అన్నమాట విస్మరించకు! నీకు నిజంగా నీ కొడుకే కావాలనుకుంటే వాణ్ని తీసుక వెళ్ళి పో! మాకేం అభ్యంతరం లేదు' కోపంగా అంది.

నా కొడుకుని నా కిచ్చేస్తే నాకు అది చచ్చినా బ్రతికినా అక్కర్లేదండి ?' అన్నాడు రామన్న.

'అయితే ఇవ్వాల్లే తీసుకుపో! రెండేళ్ళ నించీ తల్లి లేకుండా నీ దగ్గర వుండేవాడు కనుక ఎలానూ వాడు నీతోటి రావడానికి అభ్యంతరము చెప్పడు కదూ ?' అంది.

'నేనంటే ప్రాణం అండీ! ఆ రోజు చూశారుకదూ నేను కనపడగానే నాకాళ్ళకి చుట్టుకొని ఎట్టా ఏడ్చేసినాడో !' రామన్న అన్నాడు.

'రాఘూ' రామన్న కనపడగానే ఏడ్చేయటం సుందరమ్మ చూసింది. కాని ఆమెకి రాఘూ, రామన్న అంటే భయంతో ఏడ్చాడో, ఆపేక్షపొంగిపోయి ఏడ్చాడో అవగతం కాలేదు.

ఒక్కసారి మునెమ్మకేసి చూసింది సుందరమ్మ మునెమ్మ రామన్న చేతిలో చావుదెబ్బలు తినీ తినీ, శోషవచ్చి పడిపోయింది. ఆమె కళ్ళ చుట్టూ పరుచుకున్న నల్లని వలయాకారపు నీడని చూస్తోంటే. సుందరమ్మ మనస్సు అజ్ఞాత వేదనతో క్షణం సేపు గిజగిజ లాడింది.

ఆ ఆవేదన క్షణంసేపే వుండగలిగింది. సుందరమ్మ హృదయంలో, తోటి స్త్రీ పట్ల ప్రజ్వరిల్లిన సానుభూతి, మాతృత్వపు మమకారం చెరిపివేసింది.

'అయితే వెంటనే తీసుకపో, మళ్ళీ ఈ ప్రాంతాల కనపడకుండా వెళ్ళిపోండి. ఇటువెంపు వుంటే మళ్ళీ ఎప్పుడో

మునెమ్మ తీసుకొనిపోతుంది. అందుచేత ఇటు కాకుండా ఎటో దూర ప్రాంతాలకి వెళ్ళిపోండి. అయిదారు వందల రూపాయలదాక నేను సర్దుతాను. ఏదన్నా చిన్న వ్యాపారం పెట్టుకో. పిల్లవాడికి చదువు చెప్పించి జాగ్రత్తగా పెంచు. చప్పున దానికి తెలివి రాకముందే వెళ్ళిపోండి ఇద్దరూ' అంది సుందరమ్మ.

'మా రాజు తల్లివి! అందరాడోళ్ళూ నీలాంటి వారవుతే అందరి సంసారాలూ కలకాలం పచ్చగా వుంటయి తల్లీ!' ఆమె పాదాలకి వంగి ప్రణమిల్లినాడు రామన్న. సుందరమ్మ లోనికి వెళ్ళి అంబులన్స్‌కి ఫోన్ చేసింది.

'హాస్పటల్‌లో బెడ్ మీద వున్న మునెమ్మ నీరసంగా కళ్లువిప్పి చూసింది. నర్సు వచ్చి మునెమ్మతో' నీ వింక రేపు ఇంటికి వెళ్ళొచ్చు' అంది.

'అల్లాగే నమ్మా!' కృతజ్ఞతగా అంది మునెమ్మ. ఇంటికి వచ్చి రాధూ కోసం వెతుక్కుంది.

'వాడిని తండ్రి తీసుకపోయాడు' అంది సుందరమ్మ. మునెమ్మ కళ్ళమ్మట నీళ్లు వర్షించాయి.

'ఎందుకని నా బిడ్డని ఆడికి అప్పచెప్పారమ్మగారూ! ఆడు నా బిడ్డతండ్రి కాదు రాక్షసుడు' అంది.

సుందరమ్మ మ్లానంగా నవ్వింది.

'పిచ్చిదానా ఆడదానివి, కాయకష్టం చేసుకుని బ్రతికే దానివి. నువ్వు వాణ్ణి ఎలా పెంచి పెద్దవాణ్ని చేస్తావు?

తండ్రివద్ద వుంటే వాడు జాగ్రత్తగా పెంచుతాడు. మనం లేనిపోని మమకారాలతో పిల్లలభవిష్యత్తు పాడుచేయకూడదు. పిల్లలమీద తల్లికీ, తండ్రికీ కూడా సమానబాధ్యతవుంది. ఆ బాధ్యత ఎవరు సక్రమంగా నిర్వహించగలరని తోస్తే, వారికి పిల్లల భవిష్యత్తుని అప్పగించటం సంఘం బాధ్యత. నీవు నిశ్చింతగా వుండు. ఎప్పుడో రాఘూ పెద్ద ఉద్యోగస్తుడయి వచ్చి నిన్నుకూడా తీసుకవెళతాడు.'

'మీకు తెలియదమ్మగోరూ ! నా బిడ్డ, నా బిడ్డ...' అంతకన్నా పేరేమీ చెప్పలేక బయటికి పరుగెత్తింది మునెమ్మ.

పిచ్చిదానా ! నాబిడ్డ భవిష్యత్తు నీవు చెడగొట్టదల్చుకున్నావు. నా బిడ్డ భవిష్యత్తు అలావదిలిపెట్టగలనా నేనుబ్రతికుండగా అట్లా పడనిస్తానా ? ఎవరి బిడ్డలువారికీ బాగావుండాలి అంతే !' తనలో తనుఅనుకుంది.

'అమ్మగారూ ! అలా ఆలోచిస్తోండి పోయారేం ?' అన్న 'బాలూ' మాటలకి ఒక్కసారి ఉలిక్కిపడింది. గమ్మున బాలూని దగ్గరగా తీసుకుని, వాడికి ఊపిరి సలపకుండగా రెండు బుగ్గలూ, అదేపనిగా ముద్దాడ సాగింది సుందరమ్మ. బాలూకి ఏమీ అర్థంగాక తల్లి హృదయంలోకి ఒదిగిపోయాడు.

* * *